నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 4 ఫిబ్రవరి 2025 | HYDERABAD

బడ్జెట్‌లో కేంద్రం తెలంగాణకు నిధులు కేటాయించకపోవడంపై సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న ఆపార్టీ నేతలు

పై వంతెన పూర్తికాదు.. కింద రోడ్డు సరిచేయరు

ఉప్పల్ ప్రధాన రహదారి దుస్థితి ఇది.. రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు అవస్థలుపడుతున్నారు

ట్రాఫిక్ నత్తనడకన

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగర పరిధిలో సగటు నగర వాసి నిత్యం ఎదుర్కొనేది... ట్రాఫిక్ సమస్య. ఇల్లు దాటి బండి స్టార్ట్ చేశాడంటే ఏ జంక్షన్‌లో ఎంతసేపు పడిగాపులు కాయాలో కూడా తెలియని విషమ పరిస్థితి. ఏడాదిన్నర, రెండేండ్ల కిందటి వరకు నగరంలో వాహనాల సగటు వేగం 26 కిలోమీటర్లు ఉంటే... ఇప్పుడు అది ఏకంగా 17 కిలోమీటర్లకు పడిపోయింది. దేశంలోనే ఇతర మెట్రో నగరాల్లో కంటే హైదరాబాద్ నగరంలో మెరుగైన రవాణా వ్యవస్థ ఉండటంతో పాటు అద్భుతమైన నిర్వహణ కారణంగా ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు తగ్గాయని కొనియాడిన టామ్ టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ ఇప్పుడు నగరంలో వాహనాల సగటు వేగం దాదాపు 9 కిలోమీటర్లకు పడిపోయినట్లు చూపుతున్నది. అంతేకాదు... ట్రాఫిక్ జంఝాటం అనగానే గుర్తొచ్చే బెంగళూరు నగరానికి మన నగరం పోటీపడుతుండటం ఆందోళన కలిగించే పరిణామం కాగా పుండు మీద పుట్రలా... అప్పుడే ఎండలు దంచి కొడుతుండటంతో నగరంలో వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా మారనున్నాయి.

సిటీలో నానాటికీ ట్రాఫిక్ సమస్య తీవ్రం

గంటకు 17 కిలోమీటర్లకు మించని సగటు వాహనాల వేగం

ఇతర నగరాల్లో ఇంతకు మించి వేగం

గతంలో హైదరాబాద్ రోడ్లపై వాహనాల వేగం గంటకు 26 కి.మీ

ఎండలు ముదురుతుండటంతో మరింత ఇబ్బందులు

తిరోగమన దిశలో నగరం...

కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత ఏడాదిలో నగరంలో ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పని అందుబాటులోకి రాలేదనేది అందరికీ తెలిసిందే. ముఖ్యంగా రవాణా రంగంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేసిన ఫ్లైఓవర్లకు రిబ్బన్ కటింగ్ మినహా కొత్త ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగలేదు. దీనికి తోడు ట్రాఫిక్ నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా తయారు కావడంతో పరిస్థితి తిరోమన దిశలోకి వెళ్లింది. వాస్తవానికి ఏటా రోడ్లపైకి వచ్చే వాహనాల సంఖ్య పెరుగుతున్నది. అయితే ప్రభుత్వం ఇందుకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన పెంచడంతో పాటు నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం ద్వారా సమస్య జటిలం కాకుండా నియంత్రించవచ్చు. కానీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో ఆ ప్రభావం నగరంలోని వాహనాల సగటు వేగంపై గణనీయంగా పడింది. ఫలితంగా గంటకు సగటున 26 కిలోమీటర్ల వేగంతో వెళ్లాల్సిన వాహనాలు ఇప్పుడు 17 కిలోమీటర్ల మందగమనంతో ముందుకు కదులుతున్నాయని టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ ద్వారా వెల్లడవుతున్నది. వారం రోజులుగా పరిశీలించినా కొన్ని పర్యాయాలు వేగం 16 కి.మీలకూ పడిపోయినట్లు ఇండెక్స్‌లో స్పష్టమవుతున్నది.

పలు నగరాల్లో సోమవారం సాయంత్రం 7 గంటల సమయానికి సరాసరి వాహనాల వేగం

నగరం	వాహన వేగం (కిలోమీటర్లు /గంట)
హైదరాబాద్	17.0
బెంగళూరు	14.6
ముంబై	18.0
న్యూఢిల్లీ	19.1
అహ్మదాబాద్	19.5
కోల్‌కతా	17.6
చెన్నై	14.6
పుణె	17.1

ఇనార్బిట్ మాల్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ

హైటెక్‌సిటీ-బయోడైవర్సిటీ మార్గంలో..

ఎస్ఆర్‌డీపీతో శరవేగంగా..

కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ) కింద శరవేగంగా ఫ్లైఓవర్లు, ఆర్‌యూబీలు, ఆర్వోబీల నిర్మాణం పూర్తి చేశారు. కేవలం మొదటి దశలోనే భాగంగా 31కి పైగా ఫ్లైఓవర్లు, వంతెనలు అందుబాటులోకి రావడంతో వాహనదారులకు మునుపెన్నడూ లేని ఊరట లభించింది. రెండేండ్ల కిందట నగరంలో వాహనాల సగటు వేగం గంటకు 26 కిలోమీటర్లకు చేరింది. అందుకే అప్పట్లో జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల నుంచి హైదరాబాద్ నగరం ప్రశంసలు అందుకున్నది. పలువురు పారిశ్రామికవేత్తలతో పాటు సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు కూడా ట్రాఫిక్ అంశంలో బెంగళూరుతో బేరీజు వేసి అక్కడ ట్రాఫిక్ నరకం... ఇక్కడ సాఫీగా ట్రాఫిక్ ఉందని ఫొటోలతో సహా నగరాన్ని కొనియాడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో రవాణా రంగంలో మౌలిక సదుపాయాల కల్పన అనేది అదే వేగం, ప్రభుత్వ చిత్తశుద్ధి అదేరీతిన కొనసాగితే నగరంలోని వాహనదారులకు మరింత ఉపశమనం లభించేది.

మునుపటికంటే...

టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ ప్రకారం... ప్రస్తుతం నగరంలో ట్రాఫిక్ జంఝాటం పుణ్యాన వాహనదారులు రెండేండ్ల కిందట రోడ్లపై గడిపే సమయానికి కంటే ఇప్పుడు అత్యధికంగా గడపాల్సి వస్తున్నదని వెల్లడైంది. ఒకవైపు వాహన వేగం తగ్గడంతో పాటు ట్రాఫిక్ జామ్‌లు కూడా పెరిగిపోవడంతో నిత్యం వాహనదారులు నరకాన్ని చూస్తున్నట్లుగా అర్థమవుతుంది. ఈ క్రమంలో ప్రస్తుత ట్రాఫిక్ తీవ్రత దృష్ట్యా నగరంలో పది కిలోమీటర్లు ప్రయాణించే వాహనదారుడు ట్రాఫిక్‌లో నిర్ణీత సమయం కంటే అదనంగా గడుపుతున్న సమయాన్ని లెక్కిస్తే ఏడాదికి 85 గంటలు అంటే మూడు రోజులకు మించి 13 గంటలు ఎక్కువగా ఉంటున్నాడు. అయితే 2023తో పోలిస్తే ఇది 2.17 గంటలు అధికం. అదేరీతిన రోజూ 25 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన వాహనదారుడు ఏడాదికి ఏడు రోజుల మీద 16 గంటల పాటు అదనపు సమయాన్ని గడుపుతున్నాడు. రెండేండ్ల కిందటితో పోలిస్తే ఇది ఏకంగా 25 రోజుల ఐదు గంటల అధికం కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఫిబ్రవరి మొదటి వారంలోనే ఎండలు దంచికొడుతుండటంతో హెల్మెట్లు పెట్టుకొని నగర రోడ్లపై గంటల తరబడి ఉండటమంటే వాహనదారుల బాధలు వర్ణణాతీతం.

అక్రమ నిర్మాణాల నేలమట్టం

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 3: శంషాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న సంపత్‌నగర్ కాలనీలో హెచ్ఎండీఏ పార్కు స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలను సోమవారం తెల్లవారుజామున హైడ్రా సీఐ తిరుమలేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కూల్చివేశారు. దీంతో పాటు ఊటుపల్లి ఇంద్రానగర్ కాలనీలో రోడ్లను ఆక్రమించి చేట్టిన నిర్మాణాలను కూడా నేలమట్టం చేశారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులను అక్రమ నిర్మాణదారులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని నిర్మాణాలను కూల్చివేశారు.

పార్కు స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న హైడ్రా అధికారులు

8 నెలలుగా సాగుతూనే ఉంది..

రామ్‌కోఠి షాలిమార్ ఫంక్షన్ హాల్ చౌరస్తా వద్ద చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో చుట్టుపక్కల కాలనీలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు.

నార్త్ సిటీ మెట్రోకు..భూసార పరీక్ష

సిటీబ్యూరో: నార్త్ సిటీ మెట్రో నిర్మాణంలో మరో అడుగు ముందుకు పడింది. ప్రస్తుతం డీపీఆర్ తయారీపై హైదరాబాద్ మెట్రో సంస్థ దృష్టి పెట్టిన నేపథ్యంలో... మెట్రో నిర్మాణ ప్రక్రియలో భాగంగా పలు ప్రాంతాల్లో భూసార పరీక్షలతో భౌగోళిక అంశాలను పరిశీలిస్తున్నారు. పిల్లర్ల నిర్మాణం, మెట్రో స్టేషన్ల ఏర్పాటు వంటి అంశాల్లో భూసార పరీక్ష కీలకం కానున్నది. ఇప్పటికే నార్త్ సిటీలోని పలు ప్రాంతాల్లో బోరింగ్ విధానంలో మట్టిని సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఫేస్-2 పార్ట్ -బీ విస్తరణలో భాగంగా నార్త్ సిటీలో దాదాపు 45 కిలోమీటర్ల పొడవైన మెట్రో నిర్మాణానికి హెచ్ఏఎంఎల్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. ఇందులో జేబీఎస్ నుంచి సుచిత్ర వైపు, మరొక లైన్ శామీర్‌పేట వరకు మరో మార్గం నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించగా, సుచిత్ర మార్గంలో పలు ప్రాంతాల్లో భూసార పరీక్ష ప్రక్రియలు జరుగుతున్నాయి. దాదాపు 15-25 అడుగుల లోతున నేల స్వభావాన్ని తెలుసుకునేందుకు నమూనాలను సేకరిస్తున్నారు. జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా భూమి లోపలి వరకు రంధ్రాలు చేసి అడుగు భాగంలో ఉండే మట్టిని సేకరిస్తారు. దీని ద్వారా మట్టి నాణ్యత, రాతి పొరలతో పాటు, నేల స్వభావం ఆధారంగా ప్రాజెక్టును పరిశీలించనున్నారు. దీనికి కనీసం నెలన్నర సమయం పట్టే అవకాశం ఉండగా... ప్రస్తుతం మేడ్చల్ మార్గంలో గుండ్లపోచంపల్లి, కొంపల్లి వంటి మార్గాల్లో భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలకు సీఎం రేవంత్‌రెడ్డియే కారణం

బీఆర్‌టీయూ రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య

సిటీబ్యూరో: ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు సీఎం రేవంత్‌రెడ్డియే కారణమని బీఆర్‌టీయూ రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య అన్నారు. కాంగ్రెస్ సర్కారు అనాలోచిత నిర్ణయం వల్ల మహాలక్ష్మి ఉచిత బస్సు తీసుకొచ్చి ఆటో డ్రైవర్ల ఉపాధిపై దెబ్బకొట్టిందన్నారు. ఇంటి అద్దె, ఆటో కిస్తీలు, పిల్లలు చదువు, కుటుంబ అవసరాలు సమకూర్చుకోలేక ఆటో డ్రైవర్లు నరకం అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 80కి పైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని విమర్శించారు. బీఆర్‌టీయూ రాష్ట్ర ఆటో యూనియన్ మేడ్చల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వేముల మారయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఏడాదికి రూ.12 వేలు ఇస్తానని మోసం చేసిందని దుయ్యబట్టారు. ఇప్పుడు కొత్తగా డీజిల్ ఆటోలను ఔటర్ రోడ్డు బయటకు పంపించాలనుకుంటుందని.. అయితే వాటి స్థానంలో ఇందిరమ్మ పథకం ద్వారా ఎలక్ట్రిక్ ఆటోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మేయర్ × కమిషనర్

కమిషనర్ ఇలంబర్తిపై మంత్రి పొన్నంకు మేయర్ ఫిర్యాదు .. తన పర్యటనలో కమిషనర్ హాజరు కాకపోవడంపై ఆగ్రహం

సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తిల మధ్య అంతర్గత కోల్డ్‌వార్ కొనసాగుతున్నది. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కమిషనర్‌పై మేయర్ ఇటీవల ఫిర్యాదు చేయడమే ఇందుకు నిదర్శనం. ముఖ్యమంత్రి కార్యాలయానికి సైతం మేయర్ ఇలంబర్తి వ్యవహారాన్ని తీసుకెళ్లినట్లు మేయర్ కార్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. గడిచిన కొన్ని రోజులుగా స్టాండింగ్ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు పలు డివిజన్లలో మేయర్ పర్యటిస్తున్నారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ముషీరాబాద్ తదితర నియోజకవర్గాల్లో పలు డివిజన్లలో మేయర్ పర్యటించి.. స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. మేయర్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు ఒక రోజు ముందుగానే కమిషనర్‌కు మేయర్ కార్యాలయం సమాచారం చేరవేరుస్తుంది. అయితే మేయర్ వరుసగా చేపట్టిన ఐదు పర్యటనల్లో కమిషనర్ పాల్గొనలేదు. కనీసం మేయర్ ఫోన్ చేసినా.. స్పందించడం లేదని మేయర్ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. క్షణం తీరిక లేకుండా జూమ్ మీటింగ్‌లు, సమావేశాలు ఉండటంతో మేయర్ పర్యటనలో కమిషనర్ వెళ్లడం సాధ్యపడలేదని, జోనల్ కమిషనర్లు, కింది స్థాయి అధికారులు మేయర్ పర్యటనలో ఉంటున్నారని కమిషనర్ కార్యాలయ వర్గాలు స్పష్టత ఇస్తున్నాయి. మొత్తంగా ఈ ఇద్దరి మధ్య నెలకొన్న అంతర్గత వార్ ప్రజా సమస్యలపై ప్రభావం పడకముందే సమన్వయంతో హైదరాబాద్ అభివృద్ధికి తోడ్పాడాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సమన్వయ సమావేశాలపై నిర్లక్ష్యం

సమగ్రాభివృద్ధికి, పౌరులకు సత్వర సేవలకు సంబంధించి కీలకమైన సమన్వయ సమావేశాలను జీహెచ్ఎంసీ నిర్వహించడం లేదు. ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయ లేమితో నగర పౌరులను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నది. ప్రధానంగా అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకాలు ఉత్పన్నమవుతూ సకాలంలో పనులు చేయలేకపోతుండడం, తద్వారా ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఫుట్‌పాత్, జంక్షన్ల అభివృద్ధి, ట్రాఫిక్ సమస్య మొదలు నాలా, రహదారుల వెడల్పు, భూసేకరణ, అనుమతుల్లో జాప్యం, విద్యుత్, జలమండలికి సంబంధించి ఏ పనులు చేయాలన్నా ఏదో ఓ సమస్య ఏర్పడుతున్నది. గతంలో సిటీ సమన్వయ కమిటీ తరచూ సమావేశాలు నిర్వహిస్తూ, అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టేవారు. జలమండలి, పోలీస్, విద్యుత్, పీసీబీ, తదితర శాఖల అధికారులు సభ్యులుగా ఉండగా,

సోమవారం ప్రజావాణిలో అర్జీదారుల సమస్యలు వింటున్న బల్దియా కమిషనర్ ఇలంబర్తి

జీహెచ్ఎంసీ పెద్దన్న పాత్రను పోషించేది. ప్రతి నెలలో రెండు సార్లు కన్వర్జెన్సీ సమావేశాలు నిర్వహించేవారు. కానీ గడిచిన కొన్ని నెలలుగా ప్రభుత్వ శాఖలతో జీహెచ్ఎంసీ సమన్వయం కుదరడం లేదు.

వ్యవహార శైలి వివాదాస్పదం

కొన్నిరోజులుగా కమిషనర్ ఇలంబర్తి వ్యవహార శైలి వివాదాస్పదమవుతూనే ఉంది. మేయర్, కార్పొరేటర్లను ఏమాత్రం పట్టించుకోకుండా కమిషనర్ అంతా తానై అన్నట్లు నిర్ణయాలు తీసుకోవడం విమర్శలకు తావిస్తున్నది. స్టాండింగ్ కమిటీ ప్రతి వారం జరగడం లేదు. ఏజెండాలు లేవన్న సాకుతో వాయిదాలు పడుతూ వస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సైతం ఆలస్యమైందని సభ్యులు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా కమిషనర్ ఇలంబర్తి కార్పొరేటర్లకు సమయం ఇవ్వడం లేదని, డివిజన్లలో చాలా సమస్యలు పెరిగిపోతున్నా.. ప్రతిపాదనలను పట్టించుకోవడం లేదని, క్షేత్రస్థాయిలో అధికారులు కనీస ప్రొటోకాల్ పాటించడం లేదని బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు మండిపడుతున్నారు.

19వేల పైచిలుకు రిజిస్ట్రేషన్ల నిలిపివేత

బాధితుల తరపున పోరాడుతున్న ఎమ్మెల్యే మర్రి

మేడ్చల్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): వక్ఫ్ బోర్డు పేరిట రిజిస్ట్రేషన్ల నిలిపివేతపై ఇంటి యజమానులు ఆందోళన చెందుతున్నారు. మేడ్చల్ జిల్లాలోని మల్కాజిగిరి నియోజకవర్గంలో వక్ఫ్ బోర్డుకు సంబంధించిన భూమిలో ఇండ్లు నిర్మించుకున్నందున రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని వక్ఫ్ బోర్డు ప్రకటించడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో వందలాది కాలనీల్లో సుమారు 19,603 ఇండ్లు ఉండగా, వాటికి యజమానులు ఆస్తిపన్నులను యాధావిధిగా చెల్లిస్తున్న విషయం తెలిసిందే. ఎప్పుడో ఏర్పాటైన కాలనీలు, బస్తీలకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను కల్పించిందని, ఇప్పుడేమో వక్ఫ్ బోర్డు భూమి అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమని విమర్శలు వస్తున్నాయి. కాగా, రిజిస్ట్రేషన్ల నిలిపివేతపై మల్కాజిగిరి నియోజకవర్గంలోని కాలనీల, బస్తీల ఇంటి యజమానులు ఆందోళనను ఉధృతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. రిజిస్ట్రేషన్ల నిలిపివేతను ఎత్తివేయకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు. బాధితులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మద్దతుగా నిలుస్తున్నారు. రిజిస్ట్రేషన్ల నిలిపివేత నిర్ణయంపై ప్రభుత్వం వెనక్కి తగ్గేవరకు బాధితులకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ల నిలిపివేతపై ప్రభుత్వం దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లినా.. ఎలాంటి స్పందన రాలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను స్వయంగా కలిసి బాధితుల తరపున ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి వినతి పత్రాలను సమర్పించారు. అయితే ప్రభుత్వం స్పందించకుంటే.. బాధితుల తరపున న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు.